సాక్షి చిత్తూరు

బుధవారం । 7 । జూన్ । 2023

I



దాహార్తిని తీర్చేందుకు రూ.2,370 కోట్లు

ఉమ్మడి జిల్లాలోని పడమటి నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్యలు చేపట్టారు. - IIలో



చల్లంగా చూడు గంగమ్మతల్లీ

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం పోటెత్తారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	23
గూడూరు	43	30
నగరి	42	29

న్యూస్‌రీల్

ఘనంగా దూడల పండుగ



పరుగుపందెంలో దూసుకెళుతున్న దూడ

బైరెడ్డిపల్లె : మండలంలోని బైరెడ్డిపల్లె పంచాయతీ మిట్టపల్లెలో మంగళవారం ఘనంగా దూడల పండుగ నిర్వహించారు. జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దూడలను తీసుకువచ్చి పరుగు పందెంలో వదిలిపెట్టారు. విజేతగా నిలిచిన దూడలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతిగా రూ.20వేలు, మూడో బహుమతిగా రూ.15వేల నగదు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మిట్టపల్లె యూత్ సభ్యులు జాగ్రత్తలు చేపట్టారు.

సారా రహిత జిల్లానే లక్ష్యం




మాట్లాడుతున్న డ్వామా పీడీ తులసి

కార్వేటినగరం : జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు డ్వామా పీడీ తులసి తెలిపారు. పరివర్తన2.0లో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ సారా మహమ్మారిని అరికట్టేందుకు మహిళలు ముందుకురావడం అభినందనీయమన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు సారా తయారీ, విక్రయాల నిర్మూలనకు పోలీసులతో కలిసి సమష్టిగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు మాట్లాడుతూ మద్యం అమ్మకాలు, తయారీ కారణంగా పలువురు కేసుల్లో చిక్కుకుని ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఏఈఎస్ ఆయూషా బేగం మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న సున్నా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలోనే సారా రహితంగా తమ గ్రామాలను తయారుచేసుకుటున్నారని వివరించారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలతో పాడి పశువులను కొనుగోలు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం రవి, ఎల్డీఎం హరీష్, ఏపీడీ రవి, ఏపీఎం విజయకుమార్, సర్పంచ్ ధనుంజయవర్మ, ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు జయశంకర్, భాస్కర్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవేకు అటవీశాఖ అనుమతులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో నిర్మిస్తున్న చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసింది. మంగళవారం ఈమేరకు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డితో ఎన్‌హెచ్‌ఏఐ పీడీ కార్తీక్‌రెడ్డి సమావేశమయ్యారు. పలమనేరు డివిజన్ పరిధిలోని కౌండిన్య అటవీ ప్రాంతంలో 42 కిలోమీటర్ల మేర 4 లైన్ల రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఇందుకు సంబంధించి సర్వే పూర్తయినట్లు వెల్లడించారు.


మామిడితోటపై ఏనుగుల దాడి



ధ్వంసమైన కంచె

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరులో సోమవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఖాదర్‌బాషా అనే రైతుకు చెందిన మామిడితోటలో చెట్లు, ఇనుప కంచె, కూసాలను విరిచేశాయి. ఈ మేరకు బాధితుడు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

నేడు సంకటహర చతుర్థి వ్రతం



కాణిపాకం ఆలయం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భక్తులు రూ.350 టికెట్ తీసు కుని వ్రతంలో పాల్గొనవచ్చని సూచించారు. రాత్రి స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అతిసారం.. అంతు చూద్దాం!



- జిల్లావ్యాప్తంగా డయేరియా నియంత్రణ పక్షోత్సవాలు
- 17 వరకు ఉధృతంగా అవగాహన కార్యక్రమాలు
- వ్యాధి లక్షణాలపై అప్రమత్తం చేస్తున్న అధికారులు
- తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచనలు

అతిసారం.. అలసత్వం వహిస్తే ఆయువుకే ప్రమాదం. ముఖ్యంగా చిన్నారులకు ప్రాణసంకటం. అపరిశుభ్రమైన ఆహారం భుజించడం.. కలుషిత జలం సేవించడం ద్వారా దయేరియా బారినపడుతుంటారు. నీళ్ల విరేచనాలతో డీహైడ్రేషన్‌కు గురై ఒక్కోసారి మృత్యువాత పడుతుంటారు. చిన్నపిల్లల్లో తలెత్తే ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. దయేరియా లక్షణాలు.. జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.



అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు (ఫైల్)

చిత్తూరు రూరల్ : వేసవి.. వర్షాకాలాల్లో అతిసార వ్యాధి విజృంభిస్తూ ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి సోకుతూ ఉంటుంది. చిన్నపిల్లల్లో అతిగా నీళ్ల విరేచనాలు వస్తుంటాయి. దీంతో వారి మరణానికి కూడా దారితీస్తూ ఉంటుంది. ఈ క్రమంలో చిన్నారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ప్రారంభించింది. ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టింది.

ముమ్మరంగా అవగాహన

జిల్లాలో 0–5 ఏళ్ల లోపు చిన్నారులు సుమారు 45 వేల నుంచి 50వేల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులకు డయేరియా నివారణపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా ముమ్మరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అతిసార మరణాలను సున్నా చేయడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. అలాగే డయేరియా బారిన పడిన వారికి సకాలంలో వైద్యసేందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈమేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేశారు. 5 ఏళ్ల లోపు పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశ కార్యకర్తలు వెళ్లి కుటుంబ సభ్యులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. ఆరోగ్యం, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. చేతులు శుభ్రం చేసుకోవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లులు తమ పిల్లలకు పాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు :	పరీక్షలు :	నివారణ :
విరేచనాలు, వాంతులు, తక్కువ ఉష్ణోగ్రతతో జ్వరం, కడుపులో వికారం, ఆహారం సహించకపోవడం	విరేచన పరీక్ష చేయడం ద్వారా నిర్ధారిస్తారు.	మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను పక్కాగా శుభ్రపరుచుకోవాలి. కాచి చల్లార్చిన నీరు సేవించాలి. వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడం ద్వారా దయేరియా బారిన పడకుండా చూసుకోవచ్చు.

కారణాలు: సాధారణంగా మే, జూన్‌లో రోటా వైరస్ విజృంభణ కారణంగా ఉధృత దయేరియా సోకుతుంది. కలుషిత ఆహారం, నీరు, తినుబండారాల ద్వారా రోటా వైరస్ శరీరంలో చేరుతుంది. ఇది అన్ని వయసుల వారికి సోకే ప్రమాదముంది. అయితే పిల్లల్లో ప్రాణంతకమవుతుంది.

> **అప్రమత్తత అవసరం**
>
> దయేరియా నివారణకు అప్రమత్తత అవసరం. గతంలో ఎక్కువ మంది ఈ వ్యాధి కారణంగా మృత్యువాత పడేవారు. ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరగడంతో మరణాల సంఖ్యల తగ్గుముఖం పట్టింది. ఎవరికైనా నీళ్ల విరేచనాలు అవుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. సొంత వైద్యం మంచిది కాదు. ముఖ్యంగా పిల్లల విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదు. – రవిరాజు, డీఐఓ

మహిళల రక్షణకే తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్ : మహిళల రక్షణకే తొలి ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. మంగళారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో 'ప్రతి గడపకూ మహిళా పోలీస్' కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ త్వరలోనే విశిష్ట కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. మహిళా పోలీసులు ప్రతి ఇంటికీ వెళ్లి అక్కడి స్త్రీల సమస్యలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. వాటిని పరిష్కరించడంలోనూ మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలని కోరారు. ఇటీవల గృహిణులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని తెలిపారు. దీనిపై మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం యాప్ పనితీరు, ఎలా ఉపయోగించాలి అనే అంశాలను వివరించారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, దిశా డీఎస్పీ బాబు ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్, సీఐలు భాస్కర్, మద్దయ్య ఆచారి, బాలయ్య, ఆర్‌ఐ నీలకంఠేశ్వరరెడ్డి, దిశా ఎస్‌ఐ నాగసౌజన్య పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీసులు

మద్దతు ధరకే మామిడి కొనుగోలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



కుప్పం: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే మామిడి కాయలను కొనుగోలు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజన్‌లో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు కిలో రూ.15.50 వంతున ప్రాసెసింగ్ యూనిట్ వారు మామిడిని కొనుగోలు చేయాలని సూచించారు. తర్వాత మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి మద్దతు ధరను మరోసారి ప్రకటిస్తామని వెల్లడించారు. గాలివాన కారణంగా పంట రాలిపోతుందని పక్వానికి రాకుండా కాయలను కోయవద్దని రైతులను కోరారు. పంట మొత్తం ఒకేసారి ప్రాసెసింగ్ యూనిట్‌ల వద్దకు తీసుకువెళ్లకూడదన్నారు. ఈ విషయంలో రైతులు సంయమనం పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పండ్ల పరిశ్రమ సమాఖ్య నాయకులు గోవర్ధన్ బాబీ, శివకుమార్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం


కుప్పం/కుప్పంరూరల్ : నాడు–నేడు, ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కుప్పం మండలంలో ఆయన పర్యటించారు. బంగారు నత్తం వద్ద ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సందర్శించారు. చందంలోని పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. నూలుకుంట గ్రామంలో హౌసింగ్ పనులను తనిఖీ చేశారు.ఎన్.కొత్తపల్లి పీహెచ్ సీ కేంద్రానికి వెళ్లి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ జానకమ్మ పాల్గొన్నారు.

రామకుప్పం : మండలంలోని కెంపసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంపీపీ సుబ్రమణ్యం విజ్ఞప్తి మేరకు పాఠశాలలో వెంటనే తాగునీటి బోరు వేయించాలని ఆదేశించారు. జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈక్రమంలో చెల్దిగానిపల్లెలో సాగుచేస్తున్న మామిడితోటలను పరిశీలించారు. మణీంద్రం గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. తహసీల్దార్ మురళి, వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి, చెల్దిగానిపల్లె సర్పంచ్ రాజా, నేతలు మధుసూదన్ రెడ్డి,మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

జైశ్రీరామ్



వేదికపై చిత్ర యూనిట్



రామబాణం



సినీబృందంతో ముఖ్య అతిథులు చిన్నజీయర్ స్వామి, వైవీ సుబ్బారెడ్డి



ప్రభాస్‌తో చెవిరెడ్డి తనయులు

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి వెంకన్న పాదాల చెంత జైశ్రీరామ్..జైశ్రీరామ్ నినాదం మార్మోగింది. మంగళవారం ఎస్వీయూ తారకరామా స్టేడియంలో పాన్‌ఇండియా చిత్రం ఆదిపురుష్ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ అట్టహాసంగా సాగింది. తిరుపతిలో జరిగిన ప్రీరిలీజ్ వేడుకకు ఆ చిత్ర యూనిట్‌తో పాటు హీరో ప్రభాస్, హీరోయిన్ కృతిసనన్, ఇతర నటీ నటులతోపాటు ప్రత్యేక అతిథిగా చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. హీరో ప్రభాస్ స్టేడియానికి చేరుకోగానే అభిమానులు జైశ్రీరామ్.. జైశ్రీరామ్ నినాదాలు మిన్నంటించారు. సింగర్స్, డ్యాన్సర్లు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



కళాప్రదర్శన



చంద్రప్రభ వాహనంపై శ్రీవారి చిద్విలాసం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు



చంద్రప్రభ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏడోరోజు శ్రీవారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలను సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శ్రీవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి అనంతతేజోమూర్తిగా విరాజిల్లుతున్న వైకుంతనాథుడు చంద్రప్రభ వాహనాన్ని అధిష్ఠించి మాడవీధుల్లో విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు శ్రీవారిని సేవించుకున్నారు. కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా ఏకాంత సేవ జరిపించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు పాల్గొన్నారు.

నేడు జలప్రసాద కేంద్రాల ప్రారంభం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జల ప్రసాదం కేంద్రాలను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుధవారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబొరేటరీస్ వారు ఆలయ పరిసరాల్లో 4 జల ప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు.

సర్వే శాఖ ఏడీగా గౌస్‌బాషా



జేసీ శ్రీనివాసులుకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న గౌస్‌బాషా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సర్వే శాఖ ఏడీగా గౌస్‌బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వేశాఖ ఉద్యోగులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు హెచ్‌సీఎల్ టెక్‌బీలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ మంగళవారం తెలిపారు.


ఆర్‌ఎంపీ ఆస్పత్రి సీజ్


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం : మండలంలోని కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు అక్రమంగా నిర్వహిస్తున్న ఆస్పత్రిని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు మంగళవారం సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మురళి అనే వ్యక్తి ఎలాంటి అర్హత లేకుండా ప్రజలకు చికిత్స చేస్తున్నట్టు గుర్తించామన్నారు. విద్యార్హత లేకుండా ఆర్‌ఎంపీ వైద్యులుగా చెలామణి అవుతున్న వారిపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఆర్‌ఎంపీ మురళిని అదుపులోకి తీసుకున్నామన్నారు. తేలికపాటి వ్యాధులకు కూడా అధిక డోస్‌లో మందులు వేస్తూ ఎక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని వివరించారు. నిందితుడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

దాహార్తిని తీర్చేందుకు రూ.2,370 కోట్లు


గండికోట రిజర్వాయర్ (ఫైల్)


వెలిగల్లు రిజర్వాయర్ (ఫైల్)

- శరవేగంగా సర్వే
- ఫలించిన మంత్రి పెద్దిరెడ్డి కృషి

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలోని పడమటి నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నడుంబిగించారు. కరువు ప్రాంతాలకు శాశ్వతంగా నీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రూ.2,370 కోట్లతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా సర్వే పనులను ముమ్మరంగా చేసింది. రాబోయే మూడేళ్లలో వాటర్ గ్రిడ్‌ను పూర్తిచేసి నిత్యం 178 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది.

27 మండలాలు.. 4,934 గ్రామాలు

పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజవర్గాలతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలోని 6 మండలాలు కలిపి మొత్తం 27 మండలాల్లోని 4,934 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా వాటర్‌గ్రిడ్‌ను రూపకల్పన చేశారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా పరిధిలో 3,980, వైఎస్సార్ కడప జిల్లాలోని 954 గ్రామాల్లో సర్వే పనులు చేపట్టారు. ఇందుకోసం జలజీవన్‌మిషన్ కింద కేంద్రం రూ.1,075, రాష్ట్రం రూ.1,075 కోట్లు, అర్బన్ షేర్ కింద రూ.220 కోట్లు కేటాయించారు.

పైప్ లైన్ ద్వారా..

వాటర్‌గ్రిడ్‌లో భాగంగా గండికోట రిజర్వాయర్ నుంచి 165 కిలోమీటర్లు పైప్‌లైన్ వేసి గుర్రంకొండలో 90, 60 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ డైలీ) ట్యాంకర్లకు నీటిని పంప్ చేయనున్నారు. అక్కడ నీటిని శుద్ధి చేసి రక్షిత మంచినీటి పథకాలతో ఇంటింటికీ కొళాయి ద్వారా సరఫరా చేయనున్నారు. ఈ క్రమంలో రాయచోటి వెలిగల్లు రిజర్వాయర్ వద్ద 20 ఎంఎల్‌డీ ట్యాంక్‌ను నిర్మించనున్నారు.

> **80శాతం సర్వే పూర్తి**
> సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికి దాదాపు 80 శాతం పూర్తయ్యింది. జూలైలోపు సర్వే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. గండికోట నుంచి పశ్చిమ మండలాలకు శాశ్వత ప్రాతిపదికన నీరు అందించాలని నిర్ణయించాం.
> – శంకర్‌బాబు, ఎస్‌ఈ, జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

యువకుడి ఆత్మహత్య

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం గ్రామానికి చెందిన మురళి (19) అనే యువకుడు ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మురళి తండ్రి ప్రసాద్ తిరుపతిలో ఉంటున్నాడు. తల్లి మస్కట్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో మురళి మద్యానికి బానిసగా మారాడు. తల్లిదండ్రులు పలుమార్లు హెచ్చరించాన అలవాటు మానలేదు. ఆదివారం దీనిపై మళ్లీ మందలించడంతో మనస్తాపం చెందిన మురళి ఉరివేసుకుని మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి పీలేరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

– పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పూతలపట్టు: ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకుని పురుషోత్తంనాయుడు అనే వ్యక్తి మోసం చేశాడని యం.బండపల్లె, చిన్నకలికిరికి చెందిన బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. పూతలపట్టు మండలం వడ్డేపల్లెకు చెందిన డి.పురుషోత్తం నాయుడు ఏపీఎస్‌బీసీఎల్‌లో హమాలీలుగా ఒక్కో ఉద్యోగానికి రూ.లక్ష చొప్పున 2019లో తీసుకున్నాడని తెలిపారు. ఉద్యోగం ఇప్పించకపోగా నగదును అడిగితే సమాధానం చెప్పడం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

12న అప్రెంటీస్ మేళా

శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12వ తేదీన ప్రధాన మంత్రి అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు. జిల్లాలో కేవలం శాంతిపురం ఐటీఐలో మాత్రమే జరుగుతున్న అప్రెంటీస్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 8074564049 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆస్తి తగాదాలతో యువకుడి హత్య


సుదర్శన్ (ఫైల్)

వి.కోట : ఆస్తి తగాదాలతో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం కలకలం రేపింది. వివరాలు.. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ కోనేరుగొల్లపల్లెకు చెందిన చంద్రశేఖర్, కష్టప్ప మధ్య ఆస్తి విషయంలో వివాదం నడుస్తోంది. దీనిపై ఇరువురూ గతంలో పలుమార్లు ఘర్షణ పడడంతో కోర్టులో కేసు జరుగుతోంది. ఈ క్రమంలో పొలం వద్ద మళ్లీ ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో కృష్ణప్ప కుమారుడు బాలాజీ తనకు వరుసకు అన్న అయిన చంద్రశేఖర్ కుమారుడు సుదర్శన్‌పై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇరు కుటుంబాల మధ్య ఏళ్ల నుంచి ఆస్తి తగాదాలు ఉన్నాయన్నారు. ఈ వివాదాలే హత్యకు దారితీశాయని వెల్లడించారు.

హోరాహోరీగా క్రికెట్ ఫైనల్స్


టాస్ వేస్తున్న జట్టు సభ్యులు


విజేత జట్టుతో నిర్వాహకులు

నగరి : పట్టణంలోని కేవీకే మైదానంలో రోజా చారిటబుల్ ట్రస్టు వారు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మంగళవారం హోరాహోరీగా సాగింది. బ్యాట్స్‌మెన్ చక్కటి షాట్‌లతో అలరించగా, ప్రత్యర్థి జట్టును తక్కువ స్కోర్‌కే ఆలౌట్ చేసేందుక బౌలర్లు శ్రమించారు. దీంతో ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. అండర్–14 విభాగంలో గోదావరి, కృష్ణా జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో ఒక్క పరుగుతో గోదావరి టీం విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 25 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కృష్ణా జట్టు 29.4 ఓవర్లలో 156 పరుగుకు ఆలౌట్ అయింది. దీంతో 33 పరుగుల తేడాతో గోదావరి జట్టు విజయం సాధించింది. అండర్–16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా తొలుత బ్యాటింగ్ చేసిన యమునా జట్టు 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గంగ జట్టు 159 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 45 పరుగుల తేడాతో యమున జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు బుధవారం ట్రోఫీలు అందించనున్నట్లు శాప్ కోచ్ బాబు తెలిపారు.

చల్లంగా చూడు గంగమ్మతల్లీ


ఆలయానికి పోటెత్తిన భక్తులు

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ.. అంటూ భక్తజనం మంగళవారం ప్రత్యేక అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. పలువురు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గంగజాతర తర్వాత వచ్చిన మూడో మంగళవారం కావడంతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. గంగమ్మ ఆలయం వద్ద వేకువజాము నుంచే సందడి నెలకొంది. ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పండ్లతో గంగమ్మ తల్లిని సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో గంగవేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా రంగస్థలి కళాకారులు వివిధ వేషధారణలో గంగమ్మ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా పాల్గొన్నారు.


వివిధ వేషధారణలలో రంగస్థల కళాకారులు

వృద్ధుడి అదృశ్యం


సుబ్బయ్య (ఫైల్)

నింద్ర : మండలంలోని డీకే బేడు దళిత వాడకు చెందిన సుబ్బయ్య(65) అనే వృద్ధుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడని, అప్పటి నుంచి ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిశంకర్ తెలిపారు. వృద్ధుడి జాడ తెలిస్తే 9440796725, 9440900749 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లా ఖజానాశాఖ అధికారిపై ఫిర్యాదు


డీఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న టీచర్ల సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఖజానాశాఖ డీడీ రామచంద్రపై టీచర్ల సంఘం నేతలు డీఆర్‌ఓ రాజశేఖర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో (ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోషియేషన్) చైర్మన్ మునాఫ్, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవరాజులురెడ్డి, జీవీ రమణ మాట్లాడుతూ డీడీ రామచంద్ర తనను కలిసేందుక వచ్చే ఉద్యోగులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై చర్చించేందుకు వెళితే వెటకారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డీఆర్‌ఓ స్పందిస్తూ ఫిర్యాదును పరిశీలించి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు చెంగల్‌రాయమందడి, గంటామోహన్, కిరణ్, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

ఆదాయ వనరుగా మైలేరు!

- డబ్బు సంపాదనే లక్ష్యంగా నిర్వహణ
- ప్రవేశ రుసుము కింద భారీగా వసూళ్లు


మైలేరులో పరుగు తీస్తున్న ఎద్దు (ఫైల్)

పలమనేరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు తమిళనాడు, కర్ణాటకలో మైలేర్లు (ఎద్దల పరుగుపందేలు) నిర్వహిస్తుంటారు. సాంప్రదాయం ముసుగులో కొందరు మైలేర్లను డబ్బు సంపాదనకు చక్కటి మార్గంగా మార్చుకున్నారు. మైలేర్లకు ప్రజల నుంచి మంచి ఆదరణ ఉండడంతో నిర్వాహకులకు సొమ్ము చేసుకోవడం సులువుగా తయారైంది.

సీజన్ ముగిసినా..

మైలేర్లు సాధారణంగా మార్చి నెలాఖరుకల్లా ముగుస్తాయి. కాని కొందరు ఎప్పుడు పడితే అప్పుడు మైలేర్లను నిర్వహిస్తూ డబ్బులు సంపాదించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో నాలుగైదు సార్లు మైలేర్లు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎలా మారిందో తెలుస్తోంది. ఇది సాంప్రదాయమా లేక నగదు సంపాదనకు మార్గమా అనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

రూ.లక్షల వసూలు

ఓ గ్రామంలో మైలేరును నిర్వహిస్తే నిర్వాహకులకు రూ.లక్షల్లో మిగులుతున్నాయి. మైలేరులో ఎద్దును వదలాలంటే ఒక్కో దానికి ప్రవేశ రుసుముగా రూ.వెయ్యి నుంచి రూ.1500 దాకా వసూలు చేస్తున్నారు. చిన్నపాటి గ్రామంలో అయితే 200 ఎద్దులు పోటీలకు వస్తే ప్రవేశ రుసుము కింద రూ.వెయ్యి అనుకున్నా రూ.2లక్షల వరకు వసూలవుతుంది. అదే మైలేరు ఇంకాస్త ఘనంగా చేస్తే ప్రవేశ రుసుం రూ. 1500 గా పెట్టి ఎద్దులు 300 దాకా వస్తే రూ.4.5లక్షలు వస్తుంది. మైలేరులో వేగంగా పరిగెత్తిన ఎద్దుకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు మిగిలిన ఐదు స్థానాలకు కలిపి ఓ పదివేలుగా ప్రకటిస్తారు. ఈ మొత్తం ప్రైజులకు కలిపి నిర్వాహకులు ఇచ్చేది రూ.లక్ష మాత్రమే. ఇక అల్లి నిర్వహణ, భోజనాలు ఇతర ఖర్చులకు రూ.50 వేలతో రూ.1.50 లక్షలు పోగా నిర్వాహకులకు రూ.3 లక్షల వరకు మిగులుతోంది. ఈ ఆదాయం మైలేరుకు వచ్చే ఎద్దుల సంఖ్యను బట్టి మారుతూ ఉంటుంది. ఎంత చీప్‌గా నిర్వహించినా నిర్వాహకులకు మాత్రం తప్పకుండా లాభం ఉంటుంది. పెట్టుబడి లేకుండా ఈజీగా డబ్బు వస్తుండడంతో గ్రామాల్లో యువత ఎప్పుడు పడితే అప్పుడు మైలేర్లను నిర్వహించడం ఫ్యాషన్‌లా మారింది. గతంలో గ్రామస్తులు చందాలేసుకుని పండుగను నిర్వహించి వసూలైన డబ్బుకు సరిపడా బహుమతులను పంపిణీ చేసేవారు. అయితే ప్రస్తుతం మైలేర్లు పక్కా కమర్షియల్‌గా మారిపోయాయి.

ఎద్దు పొడిస్తే ఎవరు బాధ్యులు

మైలేర్లలో ఎద్లను నిలువరించేందుకు యువత పోటీపడుతుంటారు. వేగంగా దూసుకొచ్చే ఎద్దును అడ్డుకునేందుకు సాహసిస్తుంటారు. ఒక్కోసారి ఎద్లకు వాటి యజమానులు సారా తాగించి వదులుతుంటారు. ఆ మత్తులో ఉన్న ఎద్లు ఎప్పుడు జనం మీద తిరగబడతాయో తెలియదు. వేలాదిమంది హాజరయ్యే మైలేర్లలో ఎద్లు పొడవడంతో పదుల సంఖ్యలోనే గాయాలపాలవుతుంటారు. ఒక్కోసారి వారు మృత్యువాత పడిన సందర్భాలు సైతం ఉన్నాయి. అలాంటి సమయంలో ఆయా ఘటనలకు ఎవరు బాధ్యత తీసుకుంటారనే ప్రశ్న సైతం వినిపిస్తోంది. దీనిపై పోలీసులు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. గ్రామీణ యువతకు కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉంది.